


# నా ఫొటో!

## (కేవలము వినోదము కొఱకు)

ప్రపంచకంలో నాకీ ఫొటోలమీద పుట్టినంత యసహ్యం యింక దేనిమీద పుట్టలేదు. ఈదిక్కుమాలిన ఫొటోలు తీసేయంత్రం యెవడు కనిపెట్టాడో కాని యిదె నాకొంపకూల్చింది. ఈకనిపెట్టినవాడె కనక నా కళ్ళపడినా వాడు బ్రతికి దాటిపోవడం దుర్లభం. ఒకొక్కప్పుడు యీయంత్రం వాడు నాకోసమే కాబోలు కనిపెట్టాడని యనుకుంటూ ఉంటాను. లేకపోతె అది నన్నింత దుస్థితికి తీసుకురాదు. ఏమని చెప్పుకోను, ఎవరితో చెప్పుకోను, నా దురవస్థ. ఓదార్చేవాళ్ళు లేనప్పుడు యేడిస్తే యేలాఉంటుందో వినేవాడు లేనప్పుడు చెప్పడం అలాఉంటుంది. కాని యీ ఫొటోలపై పిచ్చచూస్తె నాకున్నమతికూడ పోతోంది. ఎక్కడచూచిన యివె! ఎవడుచూచిన యీపిత్తె! నన్నీ విధంగాకూడ బ్రతుకనీయవేమోనని భయంవేస్తోంది వీటికి నామీదింత పగెందుకో!

ఆఁ! అసలున్నసంగతి చెప్పవద్దుమరి! చిన్నప్పుడు నాకుకూడ ఫొటోలంటే చాలసరదాగా ఉండేది. ఎవరైన ఫొటో తీయించుకొంటుంటే ప్రక్కగా, మనంకూడ పడదామనె వుద్దేశంచొప్పున నుంచుంటూ ఉండడం, వాళ్ళ ఫొటో పాడవుతుందని నన్ను తోసేస్తూఉండడంకూడ జరుగుతూ ఉండేది. ఫొటో తీయడం నేర్చుకుందామని ఫొటోగ్రాఫరును ‘కాకా’ చేసే వాడిని కూడాను. అసలు తీయించుకుంటెనె యీ యవస్తకొచ్చినపుడు, నిజంగా తియ్యడంకూడ వస్తె నా స్థితి యేలాఉండేదో దైవానికితెలుసు. నేనెంత సరదా పడేవాడినో నా ఫొటో తీయించుకోడానికంత భంగం కలిగేది.

మా తాతగారు పెన్షన్ తీసికొన్నప్పుడు ఆఫీసరులు అంతాకలిసి గ్రూప్ ఫొటో తీయించారు. ఆ రోజుకి నన్నుకూడ తీసుకువెడతానని చెప్పడంచేత అంతకుముందు వారంరోజులనుండి ఆయత్తపడ్డాను. ఫొటో తీయించుకుందామని చాకలిదాన్ని తొందరచేసి బట్టలు కూడ తీసుకొచ్చాను. ఇంతా హడావుడిచే ఆ రోజుకు యెదురుచూస్తె సమయానికొచ్చింది నా కెక్కడ లేని జ్వరం. ఫొటోకి వెళ్ళడానికి వీల్లేనందున చాల విచారించాను.

మరి కొన్నాళ్ళకు మా అక్కయ్యలంతా పండగకు రావడం, మా తాతగారు పెద్దవాడవడంచేత ఫామిలీ ఫొటో తీయిస్తానన్నారు మా నాన్నగారు. వెంటనె ఫొటోగ్రాఫరుకు కబురు పంపారు. నేను ఆ రోజున స్కూలు మానేసి ఫొటోతీసే వాడింటివద్దే వేశాను మకాం. తిండి తినడానికికూడ తీరుబడిలేకపోయింది. ఫొటోగ్రాఫరు సలహామీద నా ఒడుగుకు కుట్టించుకున్న సూటువేసికొని బూట్ తొడుక్కుని దర్జాగా మా తాతగారిప్రక్క కుర్చీలోకూర్చున్నాను. మా తాతగారు నా నెత్తిమీద హేట్ కూడ పెట్టారు. ఫొటోగ్రాఫరు అందరిని సద్దడంలోటి కొంత కాలయాపన చేశాడు. ఇదంత చూసేసరికి నా వళ్ళుమండింది. ఫొటో తీయించుకుందామనె సరదాకూడ పోయింది. విసిగించి, విసిగించి వాడు వన్, టు, త్రి, అన్నాడు. ఒకవారం రోజులు పోయినతరువాత కాపీలుపంపాడు. ఎవరుమట్టుకు వారె మా చిట్టిబాబు యెల్లా పడ్డాడో అని ముందుగా నా బొమ్మనె వెతకడం ప్రారంభించారు వాళ్ళ కెక్కడన్న కనిపిస్తెగా. సరే కొంత

నేపటికి మా నాన్నగారు వెధవ తియ్యడం వీను. ఫోటో పాడుచేశాడు, అంటూ నా బొమ్మ చూపిం. చారు. పోటు పెట్టుకోడంచేత కాబోలు కండ్లు నుసురు గైర్ హాజరు (ఆబ్ సెంటు) అయాయి. ఆ ముఖం యెవరికో కూడ చెప్పడానికి వీలులేకుండా ఉంది. తీయించుకొన్న మొదటిఫోటోయె యీ విధంగా అయింది.

ఫోటో తీయించిన వేళావిశేషమేమోగాని ఒక సంవత్సరములోనె మా తాతగారు, నాన్నగారు కూడ గతించారు. నేను మొదట ఫోటో తీయించుకుందామంటె జ్వరంరావడం, రెండవసారి తీయించుకుంటె పాడవడం, అంతేకాకుండ వీళ్ళచావు; ఇవన్నీ చూస్తె యింక నీజన్మలో ఫోటో తీయించుకోకూడదనుకున్నాను. ఆఫోటోసంగతి యెవరైన తలపెడితె చాలు నాకు దడ, వణుకుకూడ వచ్చేవి. అందుచే ప్రతి సంవత్సరం మాక్లాసు పిల్లలు గ్రూప్ ఫోటో అన్నప్పుడల్లా యేనోయొక వంకబెట్టి తప్పించుకుంటూ ఉండేవాడిని. ఒకొక్కప్పుడు సిట్టింగు ఛార్జెస్ యిచ్చికూడ ఫోటోలో కూర్చుండుట మానేవాడిని. ఈవిధంగా స్కూలుఫైనలు దాక దాటుకొనివచ్చాను. కాని యీసారి హెడ్ మాస్టరు పట్టుదలవల్ల తప్పిందికాదు. అందులో నేను క్లాసులో బాగాచదివేవాడినేమొ హెడ్ మాస్టరు తనప్రక్కనె కూర్చోపెట్టుకున్నాడు ఫోటోలో. 'వన్,' 'టు,' 'రెడి' అనె వరకు నేనూ టక్ చెక్ గా కూర్చున్నాను. కాని 'త్రీ' అనె సమయానికి నేను మొదట తీయించుకున్న ఫోటోసంగతి, మా నాన్న, మా తాతలచావులు జ్ఞాపకంరావడంచేత ఉలిక్కిపడ్డాను. ఆ భయంచేత బాగా కదిలాను కూడాను.

నాల్గురోజులకి కాపీలొచ్చాయి. "నీమూలాని నేను కూడ కదిలాను. ఫోటో అంతా పాడైపోయిందంటూ" చూపించాడు హెడ్ మేస్టరు. చూస్తినిగదా, నే ఉలిక్కిపడి కదలడంచేత కాబోలు హెడ్ మాస్టరు ముఖము, నా ముఖము ఏకమైనాయి. ఇదిచూచి అంతా నవ్వడం మొదలుపెట్టారు. వీడిని ఫోటోలో యెప్పుడు కూర్చోనివ్వకూడదన్నారు. ఎక్కడ కనిపిస్తె అక్కడ 'ఫోటో' అని ఏడిపించడం మొదలుపెట్టారు.

చదువుచాలించి కొన్నాళ్ళకు ఉద్యోగంలో ప్రవేశించాను వాతోటి గుమాస్తాలు ఫోటో తీయించుకుందామన్నప్పుడల్లా నా సాయంకాలమునకె తగిలేది నాకు జ్వరం. ఈలా ఉంటూండగా నాకు అమలాపురంనుంచి రెండుమూడు సంబంధాలు వచ్చాయి. ఇంటివద్ద ఆడవాళ్ళు చూస్తారు కాబట్టి నా ఫోటోతీసి పంపమని కబురుచేశారు వక బ్రాహ్మణునిచేత. నేను మాత్రం ఫోటో తీయించుకోనన్నాను. మా అమ్మ పట్టుదల యెక్కువైంది. తీయించుకోకపోతె వీల్లేదంది. ఈసారి మా అక్కయ్య నన్ను తయారుచేసింది. మూడు ప్లేట్లు ఎక్స్పోజు చేశాడు. ఒకదానిలో కళ్ళులేవు. రెండవదానిలో నాల్గుముఖాలు పడ్డాయి. మూడవదానిలోమాత్రం పండ్లుబిగించి కూర్చోడంచేతకాబోలు మూతిమాత్రం కాస్త ఎత్తుగాపడింది. మిగిలినదంతా బాగానె వుంది. ఈ ఫోటోజూచి మా వదిన 'ఏమయ్యా! చతుర్ముఖబ్రహ్మ, హనుమంతుడు అవతారాలు ఒకేసారి తాల్చావు. ఈ మహాత్మ్యమునీదా? ఫోటోగ్రాఫరుదా' అంది. సరే మూడోదె బాగుంది, అన్నిటికంటె, అని అదె పంపించారు.

ఆ ఫోటోజూచి పెండ్లికూతురు తల్లి 'ఏమయ్యా బ్రాహ్మడా! పెళ్ళికొడుకు నీకేమయిన లంచమిచ్చాడా యేమిటి. ఇంద్రుడు, చంద్రుడు అని కోశావు. చూడు ముసలికోతిలా యేలావున్నాడో' అంది. రెండవ సంబంధపుపిల్ల యీ పెండ్లికొడుకును కనక నాకుచేస్తె నేను నుయ్యోగొయ్యో చూసుకుంటానందిట, నా ఫోటోచూసి. ఈ సంగతంతా వినేటప్పటికి నాకెక్కడలేని దుఃఖంవచ్చింది. చివరకీఫోటోలవల్ల నాకు పెండ్లికూడ అయేలా కనుపించలేదు. వాళ్ళ కిష్టంలేకపోతె పూరుకోక యీ ఫోటో అందరికి చూపెంచడం మొదలుపెట్టారుట. ఆ కారణంచేత నాకు మళ్ళీ పిల్లనిస్తానని యెవడు గుమ్మమెక్కాడుకాదు. గతిలేక ఒక బీదవాళ్ళ పిల్లకి రు 800 యిచ్చి బ్రహ్మచర్యం వదల్చుకున్నాను.

ఫోటోలమీద ఫోటోగ్రాఫరులమీద నాకెంత అసహ్యంపుట్టిందో నామీదకూడ వాళ్ళకంత అసహ్యం పుట్టింది. ఏ గ్రూపు ఫోటోకన్న స్నేహితుల పట్టుదల చేత సిద్ధమైనా, ఆయనుంటెమాత్రం నే ఫోటో తీయనని ఫోటోగ్రాఫరనేవాడు. అప్పటినుంచి నాకు కోపం మరీయెక్కువైంది. ఈ ఫోటోల యంత్రం యేలాగైనా నిర్మూలంచేయాలని నాకు బుద్ధిపుట్టింది. కాని దాని వుద్దేశంకూడ అదేకాబోలు మొదటినుంచి నన్ను నిర్మూలం చేస్తూనె వస్తోంది.

ఒకరోజున మా స్నేహితులందరం కలిసి తీర్థం కెళ్ళాము. వెళ్ళి ఒక అరుగుమీద కూర్చున్నాం కొంత సేపటికి ఆ యింట్లోనుండి యొక స్త్రీవచ్చి 'ఏమండి నన్ను మీరిల్లా దగాచేయడం బాగుందా? నా కివ్వవలసినడబ్బేదో యిచ్చివేయండి' అని అనడం మొదలుపెట్టింది. నేనేమి యెఱుగనని మొఱపెట్టుకున్నాను. అంతట అదొక ఫోటో తెచ్చి 'అయ్యా చిత్తగించండి. మారుపేరుచెప్పి నన్ను మోసపుచ్చాడు, యీయన. మీరంతా యెవరో యీ తగవు పరిష్కరించ' మంది. అంతా ఫోటోచూశాం. అదిచూస్తినిగదా నాదే! నా ఫోటో అంత బాగఉండం చూచినందుకు నాకు సంతోషం కలిగింది. కాని యీ అప్రతిష్టచూస్తె చాల సిగ్గేసింది. చేసేదేమిలేక అవతలివాడెవడో యివ్వవలసిన డబ్బు యిస్తానని చెప్పి యింటికిచ్చి పంపించాను. అక్కడనుంచి నా స్నేహితులు నన్ను హేళనచేయడం మొదలుపెట్టారు. యెవరో నా ఫోటో ఆకస్మికముగా తీసి దానికిచ్చి యీపని చేయించాడు. అంతేకాని నేనేఖర్మం యెరగను.

కొన్నాళ్ళకు నన్నా వూరునుంచి బదలాయించారు. నేను కొత్తవూళ్ళో అడుగుపెట్టిన మరునాడె రోడ్డుపై నెడుతూంటగా కారాపి ఒకరు తన జేబులోనుంచి యొక ఫోటోతీసిచూచి నన్ను ఎరస్టుచేశానని తీసుకుపోయాడు. 'పూనినఖర్మం పొరుగూరెళ్ళినా పోదు' అన్నట్లు యీ దిక్కుమాలిన ఫోటోలు నన్నెప్పటికప్పుడే యిల్లా చేస్తూన్నాయి. ఆ ఫోటోగ్రాఫరు నేర్పేమిటోగాని నాకు చాల ఆశ్చర్యమేసింది. ఒకర్ని కూర్చోపెట్టి యింకొకరిఛాయ తీయగల శక్తికూడ ఉందికాబోలు అనుకున్నాను. ఆ ఖూనీచేసిన మనిషి నేనుకాదని వాదించునేటప్పటికి నా తాతలు దిగొచ్చారు. పిత్రార్జితమైన ఆస్తియంతా ఆఖరైంది. 5 6 నెలలు ఖైదులో ఉండవలసివచ్చింది. ఉద్యోగమూ ఊడింది. చివరికి తినడానికితిండి, కట్టుకుందుకు గుడ్డ లేక ఈలా తిరగవలసివచ్చింది.

—తంగిరాల రామనాథము.

